ఆ రోడ్లపై నిత్యం మురుగు పరుగు


చందా నాయక్ తండాలో రోడ్లపై పారుతున్న మురుగునీరు

- చందానాయక్ తండాలో పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు
- వాహనదారులు, పాదచారుల ఇబ్బంది
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని జీహెచ్ఎంసీ అధికారులు

మోతీనగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆ రోడ్లపై నిత్యం మురుగునీరు ప్రవహిస్తోంది. హైటెక్ సిటీకి సమీపంలో గల చందానాయక్ తండాలో రోడ్లపై 365 రోజులూ ఇదే పరిస్థితి. దుర్వాసనతో వాహనదారులు, పాదచారులు, పరిసర ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ద్విచక్రవాహనదారులు అదుపు తప్పి పడిపోయిన సంఘటనలు ఉన్నాయి. డ్రైనేజీలు పొంగి మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తున్నా, ఏడాది నుంచి ఈ సమస్య ఉన్నా జీహెచ్ఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.


చందానాయక్ తండాలో ఓ రోడ్డు దుస్థితి

దోమలతో అనారోగ్యాల బారిన పడుతున్నాం

కాలనీలో రోడ్లపై మురుగునీరు ప్రవహిస్తుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం. దోమలు వృద్ధిచెంది అనారోగ్యాల బారిన పడుతున్నాం.

-భాస్కర్ నాయక్, సునంద, స్థానికులు


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

దీక్షా దివస్‌ను విజయవంతం చేయండి

● ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

బంజారాహిల్స్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధిష్ఠానం పిలుపు మేరకు ఈనెల 29న నిర్వహిస్తున్న దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలని కార్యకర్తలకు ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ పిలుపునిచ్చారు. నవోదయ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం కార్యకర్తలు, కార్పొరేటర్లతో గురువారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డివిజన్ల వారీగా కార్యకర్తలు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. నిమ్స్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలంతా కలిసి రోగులకు పండ్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో తెలంగాణ భవన్‌లో జరిగే సమావేశానికి అందరూ హాజరుకావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కార్పొరేటర్లు దేదీప్యరావు, రాజ్‌కుమార్‌పటేల్, డివిజన్ల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు బైక్ ర్యాలీ

అమీర్‌పేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): దీక్షా దివస్ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించే బైక్ ర్యాలీని విజయంతం చేయాలని బీఆర్ఎస్ అమీర్‌పేట డివిజన్ అధ్యక్షుడు హన్మంతరావు, ప్రధాన కార్యదర్శి సంతోష్ పిలుపునిచ్చారు. ర్యాలీ బల్కంపేట ఎల్లమ్మ ఆలయం నుంచి ప్రారంభమై పాటిగడ్డ బేగంపేట మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్, అక్కడి నుంచి తెలంగాణ భవన్ వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా కేసీఆర్ ఫొటో ఎగ్జిబిషన్, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

చేనేత ఉత్పత్తులను ఆదరించాలి : కల్వ సుజాత

● సత్యసాయి నిగమాగమంలో చేనేత పట్టు వస్త్ర ప్రదర్శన ప్రారంభం


చీరను పరిశీలిస్తున్న కల్వ సుజాత

బంజారాహిల్స్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీనగర్ కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో ఏర్పాటుచేసిన జాతీయ చేనేత పట్టు వస్త్ర ప్రదర్శనను రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత గుప్తా గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతిలో పట్టు, హ్యాండ్లూమ్ వస్త్రోత్పత్తులకు ప్రత్యేకత ఉందని, ఈ ఉత్పత్తులకు నేటికీ వన్నె తగ్గలేదన్నారు. నేటి యువత కూడా హ్యాండ్లూమ్ ఉత్పత్తులను ఆదరిస్తోందన్నారు. చేనేతను ఆదరించాలని సూచించారు. నిర్వాహకుడు జయేష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ.. ప్రదర్శనలో 14 రాష్ట్రాల చేనేతకారులు, చేతిపని బృందాలు వారు తయారు చేసిన సిల్క్, హ్యాండ్లూమ్ చీరలు, డ్రెస్ మెటీరియల్ వంటివి 75 రకాల వస్త్రోత్పత్తులను అందుబాటులో ఉంచారని తెలిపారు. ప్రదర్శన డిసెంబరు 2వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు.


ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులతో మహ్మద్ వలియుల్లా

ఫార్మసీ కోర్సులు చేసిన వారికి విదేశాల్లో డిమాండ్

బంజారాహిల్స్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఫార్మసీ విద్యార్థులకు గతంతో పోలిస్తే అవకాశాలు మెరుగయ్యాయని సుల్తాన్ ఉలూం ఎడ్యుకేషనల్ సొసైటీ గౌరవ కార్యదర్శి జాఫర్ జావెద్ అన్నారు. సుల్తాన్ ఉల్ ఉలూం ఫార్మసీ కళాశాల ఒరియంటేషన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫార్మసీ విద్యార్థులు పరిస్థితులకు తగినట్లు సబ్జెక్టులను నేర్చుకుంటూ ముందుకు సాగితే విజయం సాధించవచ్చన్నారు. ఫార్మసీ కోర్సులు చేసిన వారికి విదేశాల్లో డిమాండ్ ఉందన్నారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను సొసైటీ చైర్మన్ మహ్మద్ వలియుల్లా ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ అనుపమ కోనేరు, సొసైటీ కోశాధికారి మీర్ అక్బర్ అలీఖాన్ పాల్గొన్నారు.


జీహెచ్ఎంసీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న యూనియన్ నాయకులు

దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని నిరసన

హైదరాబాద్ సిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీలోని రెగ్యులర్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కమిషనర్ ఇలంబరిదిని కలిసి వినతిపత్రం అందజేశారు. యూనియన్ అధ్యక్షుడు బాలకృష్ణ మాట్లాడుతూ.. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, వేతనాలను రూ.35 వేలకు పెంచాలని, ఎస్ఎఫ్ఏ, ఈఎఫ్ఏలకు మొబైల్‌ఫోన్లు, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. నెల రోజుల్లో డిమాండ్లను నెరవేర్చకపోతే పోరాటం చేస్తామని ఆయన పేర్కొన్నారు.

ఎట్టకేలకు పవర్ బోర్‌కు మరమ్మతులు

అమీర్‌పేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌నగర్ వెంకటేశ్వర టెంపుల్ వీధిలో కొంత కాలంగా పనిచేయని పవర్ బోర్‌కు ఎట్టకేలకు మరమ్మతులు చేశారు. కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు విషయాన్ని వాటర్‌వర్క్స్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా గురువారం మరమ్మతులు చేశారు.

సేవా కార్యక్రమాల నిర్వహణలో

సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ ఆదర్శం

● ఎమ్మెల్యే తలసాని ప్రశంస



మాట్లాడుతున్న తలసాని శ్రీనివాస్ యాదవ్

అమీర్‌పేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సేవా కార్యక్రమాల నిర్వహణలో ఎస్ఆర్‌నగర్ సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ ఆదర్శంగా నిలుస్తుందని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రశంసించారు. గురువారం బీకేగూడలోని సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్‌లో ఏర్పాటు చేసిన ఐదుగురు కౌన్సిల్ సభ్యుల సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 2008లో కౌన్సిల్ ఏర్పాటు చేసిన మొట్ట మొదటి అధ్యక్షుడు బలరామ కృష్ణమూర్తి, సభ్యులు రాములు, డీవీఎస్ అవధానీ, సుభాష్ చంద్ర బోష్, నారాయణరెడ్డిని సన్మానించారు.

అనంతరం తలసాని మాట్లాడుతూ.. 10 మంది సభ్యులతో ప్రారంభమైన కౌన్సిల్‌లో నేడు సభ్యుల సంఖ్య 140కి చేరుకోవడం సంతోషంగా ఉందన్నారు. సభ్యులు వయస్సును లెక్కచేయకుండా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. ప్రతి సంవత్సరం సుమారు 3 నెలలపాటు నాణ్యమైన ఆహారాన్ని వేలాదిమందికి అందిస్తూ ఆకలి తీర్చడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ, హెల్త్ క్యాంపుల ఏర్పాటు వంటి సామాజిక సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారని, భవిష్యత్‌లో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని, ఎప్పటి లాగానే తనవంతు సహాయ సహకారాలు ఉంటాయని తలసాని హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మి, డివిజన్ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ అధ్యక్షుడు భరత్ ప్రసాద్ దూబే, ప్రధాన కార్యదర్శి కృష్ణదేవ్‌గౌడ్, మాజీ అధ్యక్షులు పార్థసారథి, మాణిక్‌రావ్ పాటిల్, అనంతరెడ్డి, కృష్ణారెడ్డి, హన్మంతరావు, అశోక్ యాదవ్, కరుణాకర్ రెడ్డి, గోపిలాల్ చౌహాన్, పీయూష్ గుప్తా పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు ఆస్తులను సేకరించొద్దు


స్థానికులతో మాట్లాడుతున్న శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి, అధికారులు

వెంగళరావునగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): యూసుఫ్‌గూడ బస్తీ నుంచి కృష్ణకాంత్ పార్కు వరకు విస్తరించనున్న రహదారి కోసం తమ ఆస్తులను సేకరించొద్దని మధురానగర్ జి-బ్లాక్ వాసులు జీహెచ్ఎంసీ అధికారులకు విజ్ఞప్తి చేశారు. రోడ్డు విస్తరణ కోసం ఆస్తులను సేకరించడానికి 2008లో నోటీసులు జారీ చేశారు.

గురువారం జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి, సర్కిల్ 19 డీఎంసీ జకియా సుల్తానా, టౌన్ ప్లానింగ్ ఏసీపీ కృష్ణవేణి, ఈఈ రాజ్‌కుమార్, ఇతర అధికారులతో కలిసి పర్యటించారు. యూసుఫ్‌గూడ బస్తీలో నిర్మాణంలో ఉన్న సర్కిల్ కార్యాలయ పనులను పరిశీలించారు. గతంలో ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం యూసుఫ్‌గూడ బస్తీ నుంచి కృష్ణకాంత్ పార్కు వరకు రహదారి విస్తరణ కోసం సేకరించనున్న ఆస్తులు, రహదారిని పరిశీలించారు. మధురానగర్ జి-బ్లాక్ వాసులు, కాలనీ సంక్షేమ సమితి అధ్యక్షుడు మనోహర్‌రావు, ప్రధాన కార్యదర్శి కోడె సాంబశివరావు, కార్పొరేటర్ అధికారులతో మాట్లాడారు. రహదారి విస్తరణ కోసం ఆస్తులను సేకరిస్తే తాము రోడ్డున పడతామని, సర్కిల్-19 కార్యాలయ భవన సముదాయంలో కొంత భూమిని సేకరించి రహదారిని విస్తరించాలని విజ్ఞప్తి చేశారు. మధురానగర్ సి-బ్లాక్‌లో ఫుట్‌పాత్‌ను ఆక్రమించి నిర్మించిన రేకులషెడ్, ఇనుప స్టెయిర్ కేస్‌ను సర్కిల్-19 టౌన్‌ప్లానింగ్ ఏసీపీ కృష్ణవేణి పరిశీలించారు. వాటిని తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు.

సనత్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో చోరీ

● ఏడు సీసీ కెమెరాల అపహరణ

అమీర్‌పేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో(ఓల్డ్‌లో)లో చోరీ జరిగింది. ఏడు సీసీ కెమెరాలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పాఠశాల భవనం గేటు గ్రిల్స్ విరగ్గొట్టి లోపలికి ప్రవేశించి పాఠశాల గదుల తలుపులను తెరిచేందుకు విఫలయత్నం చేశారు. ఆవరణలో 10 సీసీ కెమెరాలు ఉండగా ఏడింటిని అపహరించారు. ఉర్దూమీడియం కార్యాలయం గది తలుపులు పగులగొట్టి లోపలికి ప్రవేశించి విద్యుత్ కేబుళ్లను కత్తిరించారు. రెండు గదుల్లోగల కంప్యూటర్ ల్యాబ్‌ల తలుపులను తెరిచేందుకు ప్రయత్నించారు. తాళాలు పగలకపోవడంతో వెనుదిరిగారు. పాఠశాల గురించి తెలిసిన చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన వారే చోరీకి పాల్పడి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానోపాధ్యాయురాలు మార్తా, ఉపాధ్యాయుడు శ్రీనివాస్ సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీం వేలిముద్రలను సేకరించింది.

'విద్యార్థులు క్రీడల్లో రాణించాలి'

ఎర్రగడ్డ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ప్రముఖ సంఘ సేవకుడు కళ్లెం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాష్ట్రస్థాయి అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీలకు అర్హత సాధించిన చిన్నారులకు ఎర్రగడ్డ జీపీఎస్ గ్రౌండ్‌లో గురువారం ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలను వారి అభిరుచి మేరకు చిన్నప్పటి నుంచే క్రీడల్లో ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు సూచించారు. కోచ్ అనిల్ తయ్యప్ప మాట్లాడుతూ.. ఉచిత శిక్షణ శిబిరం నిర్వహణకు కళ్లెం శ్రీనివాస్‌రెడ్డి సహకరిస్తున్నారన్నారు. ఆర్థికస్థోమత లేని విద్యార్థులకు తన సొంత నిధులతో వారికి సౌకర్యాలు కల్పిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు దీన, రోహన్, దేదీప్ పాల్గొన్నారు.


సమావేశంలో అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య

టీచర్ పోస్టులను భర్తీ చేయకపోతే ఉద్యమం

దిల్‌సుఖ్‌నగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వచ్చే డీఎస్సీలో 26వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేశ్ ఆధ్వర్యంలో దిల్‌సుఖ్‌నగర్‌లో గురువారం నిర్వహించిన నిరుద్యోగ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏ పాఠశాలకు వెళ్లి చూసినా ఉపాధ్యాయులు లేక కుర్చీలు ఖాళీగా దర్శనమిస్తున్నాయన్నారు. 20 ఏళ్లుగా ఎయిడెడ్ పాఠశాలలను ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో అవి మూసివేసే దిశలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. టీచర్ పోస్టులను భర్తీ చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ, ప్రొఫెసర్ మధు, లక్ష్మీనారాయణ, సి.రాజేందర్, అనంతయ్య, రవియాదవ్, నిఖిల్‌పటేల్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు శ్రీనగర్ కాలనీ, జలగం వెంగళరావు పార్కు ఫీడర్ల పరిధిలో, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉద్యోగ్‌నగర్, రెయిన్‌బో ఆస్పత్రి ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని బంజారాహిల్స్ ఏడీఈ పేర్కొన్నారు.

గ్రీన్‌ల్యాండ్స్ పరిధిలో..

ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఇందిరాగాంధీపురం, బ్రాహ్మణవాడి, గ్రీన్‌ల్యాండ్ గ్రే హౌండ్స్ ఐఈ ఫీడర్ల పరిధిలో, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సోమాజిగూడ, ఎస్‌బీఐ స్టాఫ్ కాలేజీ, వనమాల రెసిడెన్సీ, ఇంద్రప్రస్థ ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ చరణ్‌సింగ్ పేర్కొన్నారు.


ఎమ్మెల్సీ కోదండరాంను కలిసిన అంబేడ్కర్ వర్సిటీ జేఏసీ సభ్యులు

అంబేడ్కర్ వర్సిటీ భూ సమస్యకు త్వరలో పరిష్కారం

● ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం

హైదరాబాద్ సిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ భూమి సమస్యకు త్వరలోనే పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. గురువారం ఆయనను వర్సిటీ జేఏసీ సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ.. రెండు, మూడు రోజుల్లో సీఎంతో మాట్లాడి సమస్యను పరిష్కరించనున్నట్లు చెప్పారు. తన విన్నపాన్ని పరిశీలించి వంటావార్పు కార్యక్రమాన్ని వాయిదా వేసుకున్నందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు వడ్డాణం శ్రీనివాస్, పల్లవీ కాబడే, వెంకటేశ్వర్లు, రజని, ఉదయిని, రజనీకాంత్ పాల్గొన్నారు. అంబేడ్కర్ విశ్వవిద్యాలయ స్థలాన్ని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి (జేఎన్ఏఎఫ్ఏయూ)కేటాయించాలనే ప్రభుత్వ ఆలోచనను వెంటనే ఉపసంహరించుకోవాలని జేఏసీ సభ్యులు గురువారం నిరసనను కొనసాగించారు.

ఘనంగా రాధాకృష్ణుల విగ్రహ ప్రతిష్ఠాపన


రాధాకృష్ణులకు నైవేద్యం సమర్పించిన హరేకృష్ణ మూవ్‌మెంట్ నిర్వాహకులు

బంజారాహిల్స్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ రోడ్డు నంబరు 12 స్వయంభు లక్ష్మీనర్సింహస్వామి(స్వర్ణ) దేవాలయంలో హరే కృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం నర్సింహస్వామికి ప్రత్యేక అభిషేకం అనంతరం పూజలు నిర్వహించి రాధాకృష్ణుల విగ్రహ ప్రతిష్ఠాపన గావించారు. ఈ సందర్భంగా దేవతామూర్తులకు 108 రకాల నైవేద్యం సమర్పించారు. భక్తులతో ఆలయం కిటకిటలాడింది. హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు సత్యచంద్ర గౌర దాస ప్రవచనం భక్తులకు ఆకట్టుకుంది.


అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

పిల్లలకు వారంలోగా సర్టిఫికెట్లు ఇవ్వండి

● అధికారులకు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశం

హైదరాబాద్ సిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎన్జీవోస్, శిశువిహార్ సంరక్షణ కేంద్రాల్లోని పిల్లలకు పుట్టినతేదీ, కులం సర్టిఫికెట్లను వారం రోజుల్లోగా జారీ చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రెవెన్యూ, జిల్లా సంక్షేమాధికారి, జీహెచ్ఎంసీ సీఎంఓ, ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్, డీసీపీఓ, స్వచ్ఛంద సంస్థలతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్వచ్ఛంద సంస్థలు, శిశువిహార్ సంరక్షణ కేంద్రంలోని 1500 మంది పిల్లల కోసం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. అదనపు కలెక్టర్ ముకుందరెడ్డి, డీఆర్ఓ వెంకటాచారి, జీహెచ్ఎంసీ సీఎంఓ డాక్టర్ పద్మజ, డీడబ్ల్యూఓ అక్కేశ్వరరావు, డీసీపీఓ శ్రీనివాస్, ఇన్‌చార్జి డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజేంద్రనాథ్, ఆర్డీఓ సాయిరాం, ఎస్ఈఎం జ్యోతి పాల్గొన్నారు.

నిమ్స్‌ను సందర్శించిన ఆరోగ్యశ్రీ సీఈవో

హైదరాబాద్ సిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈవో శివశంకర్ నిమ్స్‌ను గురువారం సందర్శించారు. మెడికల్ అంకాలజీ, నెఫ్రాలజీ వార్డులో రాజీవ్ ఆరోగ్యశ్రీ లబ్ధిదారులతో ఆయన మాట్లాడారు. నిమ్స్ డయాలసిస్ వీడియో మానిటరింగ్ యూనిట్ ద్వారా జిల్లా యూనిట్లలోని డయాలసిస్ రోగులను కలిసి మాట్లాడారు. నిమ్స్ కో-ఆర్డినేటర్ మహేష్‌బాబు చికిత్స ప్రోటోకాల్ గురించి, రాజీవ్ ఆరోగ్యశ్రీ లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా అడ్మిషన్లు, సంరక్షణ గురించి వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ లక్ష్మీభాస్కర్, జేఈవో ఎంపానెల్‌మెంట్ డాక్టర్ నరేష్, జీఎం ఫీల్డ్ ఆపరేషన్స్ డాక్టర్ రాంబాబు, జిల్లా మేనేజర్ పాల్గొన్నారు.

బీసీ రాజ్యస్థాపన కోసం పోరాటం

పంజాగుట్ట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): దేశం, రాష్ట్రంలో బీసీ రాజ్య స్థాపన కోసం పోరాటం చేస్తామని వెనుకబడిన కులాల సమాఖ్య అధ్యక్షుడు ఎన్. చెన్న రాములు ముదిరాజ్ అన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి, సమాఖ్య ఆవిర్భావ సభ జరిగింది. సినీనటుడు, నిర్మాత జైహింద్‌గౌడ్, సమాఖ్య నాయకులతో కలిసి జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సమాఖ్య విధి, విధానాలు, తాము చేపట్టనున్న కార్యక్రమాలను వివరించారు. సమాఖ్య కార్యవర్గాన్ని ప్రకటించి, వారికి నియామక పత్రాలను అందజేశారు. ప్రధాన కార్యదర్శిగా మహతి రమేష్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా పిట్టల భూమేష్ ముదిరాజ్, ఉపాధ్యక్షులుగా సంగమేశ్వర్‌రావు, బండలయ్య రజక, కార్యదర్శిగా ప్రశాంత్ యాదవ్, యువత అధ్యక్షుడిగా శ్రీశైలం, మహిళా విభాగం అధ్యక్షురాలిగా సీతామహాలక్ష్మి, గౌరవాధ్యక్షురాలిగా కొండ లతాబాయి తదితరులను నియమించారు.



మహాత్మ జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జైహింద్ గౌడ్, చెన్న రాములు ముదిరాజ్ తదితరులు


జ్యోతిరావు పూలేకు నివాళులర్పిస్తున్న టీఎన్జీవో కార్యదర్శి చంద్రశేఖర్, సంఘం ప్రతినిధులు, బీఆర్ఎస్ ఖైరతాబాద్ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి, కె. విప్లవ్ తదితరులు

- ఖైరతాబాద్, బంజారాహిల్స్, ఆంధ్రజ్యోతి




ఖైరతాబాద్‌లోని బీసీ కమిషన్ కార్యాలయంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులు తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి తదితరులు.

- పంజాగుట్ట, ఆంధ్రజ్యోతి



నవగ్రహ పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత: తలసాని

రాంగోపాల్‌పేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. గురువారం రాంగోపాల్‌పేట్ డివిజన్ పరిధిలోని గైదీన్‌బాగ్‌లో పునర్నిర్మించిన శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన నవగ్రహాల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా ఆంజనేయ స్వామిని దర్శించుకొని పూజలు చేశాక, నవగ్రహాల ప్రతిష్ట పూజలలో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు తలసాని శ్రీనివాస్‌ను సత్కరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు అతెల్లి అరుణ గౌడ్, మల్లికార్జున్‌గౌడ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, ప్రధానకార్యదర్శి ఆంజనేయులు, ఉజ్జయినీ మహాకాళి దేవస్థాన మాజీ ధర్మకర్తలు మహేష్‌యాదవ్, మహేందర్, అరుణ్ భట్, నాయకులు విజయ్, బస్తీవాసులు రత్నాకర్, ఆనంద్, ప్రవీణ్, కళ్యాణ్, లావణ్య, అంజమ్మ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ యూత్ ప్రెసిడెంట్ ఆలకుంట హరి తదితరులు

దీక్షాదివస్‌ను విజయవంతం చేయండి

తార్నాక, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ భవన్‌లో శుక్రవారం నిర్వహిస్తున్న దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ యూత్ ప్రెసిడెంట్ ఆలకుంట హరి పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు తార్నాకలోని పింక్ పీరల్ ఫంక్షన్‌హాల్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా హరి మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే పద్మారావు ఆదేశాల మేరకు తార్నాక చౌరాస్తా నుంచి సుమారు 300 ద్విచక్ర వాహనాలతో భారీ బైక్ ర్యాలీగా సికింద్రాబాద్‌లోని చిలకలగూడ మీదుగా బంజారహిల్స్‌లోని తెలంగాణ భవన్‌కు వెళ్లాలని తెలిపారు.



పతకాలు సాధించిన క్రీడాకారులతో కోచ్‌లు

స్కూల్‌గేమ్స్‌లో వారాసిగూడ బాక్సింగ్ టీమ్ సత్తా

సికింద్రాబాద్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఇంటర్ స్కూల్ రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో వారాసిగూడ బాక్సింగ్‌టీమ్ సత్తా చాటింది. కోచ్‌లు శివరాజ్, రాజేష్ నేతృత్వంలో శిక్షణ పొందిన క్రీడాకారులు పతకాలు సాధించి, అందరి మన్ననలు అందుకున్నారు. అండర్-14 విభాగంలో ఎ.ప్రణీత్ గోల్డ్ మెడల్ సాధించగా, అండర్-19 విభాగంలో కె.శివనందన్ యాదవ్ రజకపతకం సాధించాడు. దాంతో మేడిబావి తదితర ప్రాంతాల ప్రజలు వారిని అభినందించారు.

పిల్లలకు వారంలోగా సర్టిఫికెట్లు ఇవ్వాలి : కలెక్టర్

హైదరాబాద్ సిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎన్జీవోస్, శిశువిహార్ సంరక్షణ కేంద్రాల్లోని పిల్లలకు ఆధార్, పుట్టినతేదీ, కులం సర్టిఫికెట్లను వారం రోజుల్లోగా జారీ చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రెవెన్యూ, జిల్లా సంక్షేమాధికారి, జీహెచ్ఎంసీ సీఎంఓ, ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్, డీసీపీఓ, స్వచ్ఛంద సంస్థలతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు, శిశువిహార్ సంరక్షణ కేంద్రంలోని 1500 పిల్లల కోసం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ముకుందరెడ్డి, డీఆర్ఓ వెంకటాచారి, జీహెచ్ఎంసీ సీఎంఓ డాక్టర్ పద్మజ, డీడబ్ల్యూఓ అక్కేశ్వరరావు, డీసీపీఓ శ్రీనివాస్, ఇన్‌చార్జ్ డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజేంద్రనాథ్, ఆర్డీఓ సాయిరాం, ఎస్ఈఎం జ్యోతి పాల్గొన్నారు.

దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని నిరసన

హైదరాబాద్ సిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీలోని రెగ్యులర్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కమిషనర్ ఇలంబరిదిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు మాట్లాడుతూ. నెల రోజుల్లో డిమాండ్లు పరిష్కరించాలని, లేని పక్షంలో పోరాటంచేస్తామని పేర్కొన్నారు. నాయకులు వెంకటేష్, దేవదాస్, మల్లేషం, భూషణం, రాము, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

1న ఉచిత వైద్యశిబిరం

చిలకలగూడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ జూబ్లీహిల్స్ ఆధ్వర్యంలో ఉచిత కంటి, చెవి, ముక్కు, గొంతు వైద్య పరీక్షల శిబిరం నిర్వహించే పోస్టరును, కరపత్రాలను గురువారం క్లబ్ ప్రతినిధులతో కలసి ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జునరెడ్డి ఆవిష్కరించారు. ఈ శిబిరాన్ని చిలకలగూడ, దూద్‌బావి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 వరకు నిర్వహించనున్నారు. పుష్పగిరి కంటి ఆస్పత్రి, మా ఇయన్ టీ హస్పిటల్ సహకారంతో నిర్వహిస్తున్నామని, చిలకలగూడ, పాండవుల బస్తీ, సీతాఫల్‌మండి, దాదార్ కంపౌడ్, వారసిగూడ తదితర ప్రాంతాల వారు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9618563924 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

● ఆంజనేయస్వామికి డిప్యూటీ సీఎం సతీమణి పూజలు



సికింద్రాబాద్ మోండా మార్కెట్‌లోని శ్రీపంచముఖి ఆంజనేయస్వామి దేవాలయానికి గురువారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణి నందిని మల్లు వచ్చారు. ఆమె స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆమె వెంట కార్పొరేటర్ కొంతం దీపిక, తదితరులు ఉన్నారు.

- రెజిమెంటల్‌బజార్

భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ 'సర్వదా సిద్ధం'

రాంగోపాల్‌పేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సర్వదా సిద్ధం అని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అంటున్నారు. గురువారం సికింద్రాబాద్ సర్దార్ పటేల్ రోడ్డులోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యాలయంలో స్కౌట్స్ బాలురకు రెండు రోజుల ద్వితీయ సోపాన్ శిక్షణ శిబిరంలో భాగంగా గురువారం వంటలలో తమ ప్రావీణ్యం నిరుపించుకునే పరీక్షలలో పాల్గొన్నారు. జాన్సన్ గ్రామర్ స్కూల్, లిటిల్ ఫ్లవర్ స్కూల్‌కు చెందిన దాదాపు వంద మంది స్కౌట్స్ పాల్గొన్న ఈ శిబిరంలో తమ వద్ద ఉన్న వస్తువులతో వంటలు చేశారు. ఈ శిబిరంలో పలువురు స్కౌట్ మాస్టర్లు, గైడ్ క్యాప్టెన్లు పాల్గొన్నారు.

- సికింద్రాబాద్ డివిజన్‌లో హోరాహోరీగా నేతల ప్రచారాలు
- ఎంప్లాయిస్ సంఘ్ కాంగ్రెస్‌కు, దక్షిణ మధ్య రైల్వే కార్మిక్ సంఘ్ బీజేపీకి అనుబంధం
- పార్టీలకు సంబంధం లేని 'మజ్దూర్'

గెలుపెవరిదో..

4, 5, 6 తేదీల్లో రైల్వే యూనియన్ల గుర్తింపు ఎన్నికలు

అడ్డగుట్ట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : డిసెంబరు 4, 5, 6 తేదీల్లో జరిగే రైల్వే యూనియన్ల గుర్తింపు ఎన్నికల్లో ఏ యూనియన్ విన్నవుతుందోనని రైల్వే కార్మికులంతా ఉత్కంఠంగా ఉన్నారు. ఈ ఎన్నికల్లో ఏ రాజకీయ పార్టీకీ సంబంధంలేని రైల్వే మజ్దూర్ యూనియన్ గెలుస్తుందా.. లేక కాంగ్రెస్ అనుబంధ సంఘమైన ఎంప్లాయిస్ సంఘ్ విక్టరీ సాధిస్తుందా.. లేక బీజేపీకి అనుబంధమైన దక్షిణ మధ్య రైల్వే కార్మిక్ సంఘ్ గెలుస్తుందా అని అంతర్మథనం చెందుతున్నారు. మూడోసారి కూడా తామే గెలుస్తామని రైల్వే మజ్దూర్ యూనియన్ దీమావ్యక్తం చేస్తుండగా... మేమే విజయం సాధిస్తామని బీజేపీ, కాంగ్రెస్ అనుబంధ సంఘాలు అంటున్నాయి.

మజ్దూర్ హ్యాట్రిక్ కొట్టేనా..

ఈసారి కూడా గెలిచి హ్యాట్రిక్ కొట్టాలని రైల్వే మజ్దూర్ యూనియన్ వివిధ విభాగాలకు చెందిన లక్షల మంది కార్మికులు వారంరోజుల నుంచే విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. దక్షిణ మధ్య రైల్వే యూనియన్ గుర్తింపు ఎన్నికల్లో 2007, 2013 సంవత్సరాల్లో విజయం సాధించామని, మూడోసారి కూడా గెలుపు తమదేనని మజ్దూర్ యూనియన్ నేతలు సికింద్రాబాద్ డివిజన్‌లో జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు.



గుర్తింపు ఎన్నికల ప్రచారంలో మజ్దూర్ యూనియన్ నేతలు

కొన్ని యూనియన్లకు రాజకీయ పార్టీలతో సంబంధం

దక్షిణ మధ్య రైల్వే కార్మిక్ సంఘ్ బీజేపీకి అనుబంధ సంస్థ. ఎంప్లాయిస్ సంఘ్ కాంగ్రెస్‌పార్టీకి అండగా ఉంటుంది. ఇక పోతే దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ఏ పార్టీకి కూడా సంబంధం లేకుండా కార్మికుల సంక్షేమం కోసం పనిచేస్తోంది. దీంతో మజ్దూర్‌కు రైల్వే కార్మికుల నుంచి మంచి ఆదరణ ఉంది. ఈ మధ్య ఎంప్లాయిస్ సంఘ్ నుంచి వందల మంది కీలక రైల్వే ఉద్యోగులు, కార్మికులు, సీనియర్ నేతలు మజ్దూర్ యూనియన్‌లో చేరారు. దీంతో ఎంప్లాయిస్ సంఘ్ యూనియన్ నేతలు తలపట్టుకుంటున్నారు. ఎక్కడ పొరపాటు పడుతున్నామో తెలియక తికమకపడుతున్నారు.

కార్మికుల సంక్షేమం కోసం 'మజ్దూర్' కృషి

కార్మికుల సంక్షేమం కోసం ఎనలేని కృషిచేస్తున్న రైల్వే మజ్దూర్ యూనియన్‌లో దేశవ్యాప్తంగా 9 లక్షల మంది సభ్యత్వం ఉంది. ఎప్పుడైనా సరే యూనియన్ గుర్తింపు ఎన్నికల్లో హైదరాబాద్ డివిజన్ తీసుకుంటే దాదాపు 51 వేలమంది సభ్యత్వం ఉంది. సికింద్రాబాద్ డివిజన్ తీసుకుంటే 15 వేల మంది సభ్యత్వం కలిగి ఉంది. మజ్దూర్ యూనియన్‌పై కార్మికుల్లో మంచి నమ్మకం ఉంది.

గెలుపుపై ధీమాతో ఎవరికి వారే

దక్షిణ మధ్య రైల్వే గుర్తింపు సంఘాల ఎన్నికల్లో డిసెంబరు 4, 5 తేదీల్లో కార్మికులు, ఉద్యోగులు ఓటేస్తారు. 6న రన్నింగ్‌స్టాఫ్ (రైళ్ల నడిపేడ్రైవర్లు, గార్డులు) ఓటేస్తారు. యూనియన్ ఏఐఆర్ఎఫ్ అనుబంధ సంస్థ మజ్దూర్ యూనియన్ ప్రచారంలో దూసుకపోతుంది. రైల్వేకార్మికుల సమస్యల్ని ఎప్పటికప్పుడూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళుతూ పరిష్కరిస్తోంది. దీంతో కార్మికులు ఆనందంతో ఉన్నారు. నిత్యం కార్మికుల హక్కుల కోసం చేస్తున్న పోరాటాలకు ఆకర్షితులై ఇతర రైల్వే గుర్తింపు సంఘాల నుంచి చాలామంది నాయకులు మజ్దూర్ యూనియన్‌లో చేరడంతో గెలుస్తామని సదరు సంఘం నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. రైల్వేలో 135 విభాగాల్లో వేలమంది పనిచేస్తున్నారు. వీరిలో 90 శాతం మంది మజ్దూర్ యూనియన్‌కే పట్టం గట్టేందుకు సిద్ధమవుతున్నారు. సికింద్రాబాద్ డివిజన్‌లోని ఖాజీపేట్, డోర్నకల్, తాండూర్, రామగుండం, పరిగి, వికారాబాద్ లింగంపల్లి, ఆలేరు, పెద్దపల్లి, సికింద్రాబాద్, ఖమ్మం, లాలాగూడ, బీదర్, మధిర, జహీరాబాద్, ఇతర బ్రాంచ్‌లను కైవసం చేసుకోవడానికి రైల్వే సీనియర్ నేతలు ప్రచారం ముమ్మరంగా చేస్తున్నారు. మిగతా రెండు సంఘాలైన కార్మిక్ సంఘ, ఎంప్లాయిస్ కూడా ఎట్టి పరిస్థితుల్లో గెలవాలని తీవ్రంగా కృషి చేస్తున్నాయి.

వ్యవస్థ సక్రమంగా పనిచేయాలి

● ఉపాధ్యాయులు కూడా మధ్యాహ్న భోజనం చేయాలి ● విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించం : ఎమ్మెల్యే శ్రీగణేష్

సికింద్రాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పదవులు, ప్రభుత్వాలు శాశ్వతం కాదని, అవి మారుతుంటాయని, అయితే... వ్యవస్థ మాత్రం సక్రమంగా పనిచేయాలనే సిద్ధాంతాన్ని తాను విశ్వసిస్తున్నట్టు కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ అన్నారు. ప్రజలు తనను గెలిపించినందున వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా, వారి సంక్షేమానికి కృషిచేస్తానని, అందుకే సమాజంలోని అన్ని ప్రభుత్వ శాఖలు సక్రమంగా పనిచేసేటట్టు చేయడమే తన లక్ష్యమని అన్నారు. మడ్‌ఫోర్టులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు పంపిణీ చేస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. వారితో కలిసి భోజనం చేశారు. ఉపాధ్యాయులు హాజరు శాతాన్ని పరిశీలించారు. నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ శాఖలను తాను సందర్శిస్తున్నానని, విధినిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించే వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నిర్లక్ష్యం చేసే వారిని తక్షణమే డిస్మిస్ చేసేలా రాష్ట్ర ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి జీఓ తెప్పిస్తానని శ్రీగణేష్ తెలిపారు. అధ్యాపకులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని, తద్వారా ఇతరులకు ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం పెరుగుతుందని అన్నారు. ఉపాధ్యాయులు ఇంటి నుంచి టిఫిన్ బాక్సులు తీసుకురావద్దని, పిల్లలు తినే మధ్యాహ్న భోజనాన్నే వారు కూడా తినాలని, తద్వారా నాణ్యత లోపించకుండా ఉండడమే కాకుండా, తల్లిదండ్రుల్లో నమ్మకం పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. తాను చిన్నప్పటి నుంచి కష్టపడి ఈ స్థాయికి వచ్చానని, అందుకే సమాజం అభివృద్ధి చెందాలంటే వ్యవస్థలు పటిష్ఠంగా ఉండాలని తపన పడుతుంటానని అన్నారు. కాగా పాఠశాలలో ఎటువంటి సమస్యలు ఉన్నా తనకు ఫోన్ చేయాలని విద్యార్థులకు శ్రీగణేష్ తన ఫోన్ నెంబర్ ఇచ్చారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేసి పాఠశాల స్థితిగతులను వివరించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్పత్రులు, పాఠశాలల్లో బయోమెట్రిక్ విధానం ప్రవేశపెట్టాలని, తద్వారా మెరుగైన ఫలితాలు సాధింవచ్చని చెప్పారు.



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

జ్యోతిరావుఫూలేను ఆదర్శంగా తీసుకోవాలి



తార్నాకలోని క్యాంపు కార్యాలయంలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్ రెడ్డి



జ్యోతిరావుఫూలేకు నివాళులర్పిస్తున్న మేకల సారంగపాణి తదితరులు

మేకల సారంగపాణి

సికింద్రాబాద్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సమాజంలో కులవివక్ష, అంటరానితనం తదితర సామాజిక రుగ్మతలను రూపుమాపడానికి అహర్నిశలు కృషిచేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని, ప్రతి ఒక్కరూ ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి అన్నారు. సీతాఫల్‌మండిలో గురువారం మహాత్మాజ్యోతిరావు పూలే చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేకల సారంగపాణి మాట్లాడుతూ వెనుకబడిన వర్గాలకు హక్కులు కల్పించడం, మహిళలకు విద్యావకాశాలు అందించడంలో పూలే కృషి అపారమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాచమల్ల కృష్ణమూర్తి, కనకట్ల హరి, కే.నాగేశ్వర్‌రెడ్డి, రవిప్రసాద్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, సరోజిని, ప్రభుగుప్తా, అంబల రాజేశ్వరరావు, రాముపర్మ, రాజేష్‌నాయర్, సతీష్‌రాజ్, ఆకుల సంపత్, గణేష్, అజయ్, సింహాచలంబాబు, దేవుడు కుమార్, ప్రతాప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మహాత్మా జ్యోతిరావుఫూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత తదితరులు

26వేల టీచర్ పోస్టులను భర్తీచేయాలి: ఆర్.కృష్ణయ్య

దిల్‌సుఖ్‌నగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వచ్చే డీఎస్సీలో 26వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీచేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేశ్ ఆధ్వర్యంలో గురువారం దిల్‌సుఖ్‌నగర్‌లో నిర్వహించిన నిరుద్యోగ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ పాఠశాలకు వెళ్లి చూసినా ఉపాధ్యాయులు లేక ఖాళీ కుర్చీలు దర్శనమిస్తుండగా, విద్యాశాఖ అధికారులు మాత్రం టీచర్ పోస్టులు తక్కువగా ఉన్నట్లు తప్పుడు లెక్కలు చూపిస్తుండడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. ఇంగ్లీషు, మ్యాథ్స్ టీచర్ పోస్టులు చాలా ఖాళీగా ఉన్నాయని పలువురు నిరుద్యోగులు తన దృష్టికి తీసుకువచ్చినట్లు ఆయన వెల్లడించారు. పాఠశాలల్లో పీఈటీ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు. ప్రతి పాఠశాలలో స్పోర్ట్స్ ఆటలకు తగిన ప్రాధాన్యత ఇచ్చి విద్యార్థుల శారీరకదృఢత్వాన్ని పెంపొందించాలన్నారు. 20 ఏళ్లుగా ఎయిడెడ్ పాఠశాలలను ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం మూలంగా అవి మూసివేసే దిశలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు తగు చర్యలు చేపట్టాలని సూచించారు. వెంటనే టీచర్ పోస్టులను భర్తీ చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ, ప్రొఫెసర్ మధు, లక్ష్మీనారాయణ, సి.రాజేందర్, అనంతయ్య, రవియాదవ్, నిఖిల్‌పటేల్ పాల్గొన్నారు.



నిరుద్యోగ సమావేశంలో అభివాదం చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

పవన్‌విహార్, ఆకాష్‌నగర్ కాలనీల్లో రూ.39.5 లక్షలతో అభివృద్ధి

సికింద్రాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): న్యూబోయినపల్లి పవన్ విహార్ కాలనీ, ఆకాష్‌నగర్ కాలనీల్లో త్వరలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నట్టు సికింద్రాబాద్ కంటోన్మెంట్ పాలక మండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ తెలిపారు. పవన్‌విహార్ కాలనీ పార్కులో రూ.11 లక్షలతో వాకింగ్‌ట్రాక్, టాయిలెట్స్, గేట్ పనులను, ఆకాష్‌నగర్ కాలనీలో రూ.3.5లక్షలతో పార్కు చుట్టూ ఇనుప కంచె, షటిల్ కోర్టు, చిన్నారులకు క్రికెట్ గ్రౌండ్ అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. గురువారం ఆయన కాలనీల్లోని పార్కులను సందర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ అభివృద్ధి పనులకు కంటోన్మెంట్ బోర్డు నుంచి నిధులు మంజూరైనట్టు తెలిపారు. అలాగే ఎమ్మెల్యే శ్రీగణేష్ నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి రూ.10 లక్షలతో పవన్‌విహార్ కాలనీలో బోర్‌వెల్ లైన్, ఆకాష్‌నగర్ కాలనీలో రూ.15లక్షలతో కమ్యూనిటీ హాలను నిర్మిస్తామని వెల్లడించారు. అభివృద్ధి పనులకు నిధులు కేటాయించిన కంటోన్మెంట్ సీఈఓ మధుకర్‌నాయక్, నామినేటెడ్ సభ్యుడు జె.రామకృష్ణ, ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్, చీఫ్ టౌన్ ప్లానింగ్ అధికారి ఫణికుమార్‌కు జంపన ప్రతాప్, కాలనీల ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు పి.బి.రెడ్డి, ప్రేమ్‌కుమార్, ప్రదీప్‌రావు, కేఎస్.రెడ్డి పాల్గొన్నారు.



పవన్‌విహార్ కాలనీ పార్కును పరిశీలిస్తున్న జంపన ప్రతాప్

ఏపీలో జూనియర్ సివిల్ జడ్జీగా ముఖేష్ కుమార్



తల్లిదండ్రులు పెండెం మనోహర్, భవానిలతో జడ్జి ముఖేష్ కుమార్

అడ్డగుట్ట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సామాన్య కుటుంబంలో జన్మించిన సికింద్రాబాద్ అడ్డగుట్టకు చెందిన పెండెం ముఖేష్ కుమార్ ఆంధ్రప్రదేశ్‌లో జూనియర్ సివిల్ జడ్జీగా నియమితులయ్యారు. ఆసియాలో అతిపెద్ద మురికివాడగా పేరున్న సికింద్రాబాద్ అడ్డగుట్ట ఆజాద్‌చంద్రశేఖర్‌నగర్ బస్తీకి చెందిన తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర కీలక ఉద్యమ నాయకుడు పేదోళ్ల కష్టం తెలిసిన పెండెం మనోహర్, భవాని కుమారుడు పెండెం ముఖేష్ కుమార్. కొద్ది రోజుల్లో జడ్జీగా పోస్టింగ్ రానుంది. ఆజాద్‌చంద్రశేఖర్ నగర్‌లో ఉంటూ 7వ తరగతి నుంచి 10 వరకు మహేంద్రహిల్స్‌లోని మాత అమృతనందమాయి స్కూలులో చదివారు. ఇంటర్ నారాయణ కాలేజీ, బీటెక్ నల్ల నర్సింహారెడ్డి కళాశాలు, ఎల్ఎల్‌బీ వరంగల్ కాకతీయ విశ్వ విద్యాలయం, ఎల్ఎల్ఎం హైదరాబాద్ ఉస్మానియా విశ్వ విద్యాలయంలో చదివారు. బస్తీ వాసులు కాబోయే జడ్జీ ముఖేష్ కుమార్‌ను అభినందించారు.

'నాన్ కింగ్ చైనీస్ రెస్టారెంట్'ను కూల్చివేయాలి

రాంగోపాల్‌పేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్క్‌లేన్ చౌరస్తాలో ఉన్న నాన్‌కింగ్ చైనీస్ రెస్టారెంట్ భవనం వంద సంవత్సరాల పురాతనమైనదని, నివాసయోగ్యమైనదని కాదని మనవ హక్కుల కమిషన్‌కు నేతాజీ ఫౌండేషన్ తరఫున సృజన గురువారం ఫిర్యాదు చేశారు. ఈ భవనం శిథిలావస్థలో ఉందని సీనియర్ సివిల్ ఇంజనీర్ల అధికారుల బృందం రిపోర్ట్ ఇచ్చారన్నారు. ఏ చిన్నపాటి భూకంపం సంభవించినా, భారీ వర్షాలు కురిసినా ఈ భవనం కూలిపోయే ప్రమాదం ఉందన్నారు. ఆ రిపోర్టులో పేర్కొన్నట్లు తక్షణమే జీహెచ్ఎంసీ సంబంధిత అధికారులు భవనాన్ని కూల్చాలని పేర్కొన్నారు. లేని పక్షంలో ఈ రెస్టారెంట్‌కు వచ్చే కస్టమర్లకు, అలాగే పనిచేసే వారికి ప్రాణ ముప్పు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇంటిపై కూలిన స్తంభం.. తప్పిన ప్రమాదం



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పద్మారావు నగర్, నవంబర్ 28 (ఆంధ్రజ్యోతి): బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధి హమాల్ బస్తీలోని దర్గా సమీపంలో గురువారం ఉదయం ఒక్కసారిగా వీచిన సుడిగాలికి చెట్టు విరిగి విద్యుత్ బంచ్ కేబుల్‌పై పడింది. దాంతో విద్యుత్ స్తంభం పక్కనే ఉన్న రేకులఇంటిపై పడటంతో ఇల్లు పాక్షికంగా దెబ్బతిన్నది. ఇంటి ఎదురుగా ఉన్న టిఫిన్ బండి పూర్తిగా ధ్వంసమైంది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. వెంటనే అప్రమత్తమైన బస్తీ నాయకులు విద్యుత్, జీహెచ్ఎంసీ అధికారులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకొన్న బీఆర్ఎస్ నాయకులు లక్ష్మీపతి దెబ్బతిన్న ఇంటిని పరిశీలించారు. అక్కడకు చేరుకొన్న విద్యుత్ సిబ్బంది విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అనంతరం జీహెచ్ఎంసీ, హార్టీకల్చర్ సిబ్బంది క్రేన్ సహాయంతో విరిగిన చెట్ల కొమ్మలను తొలగించారు. విద్యుత్ సిబ్బంది విరిగిన స్తంభాన్ని తొలగించి, దానిస్థానంలో కొత్తది ఏర్పాటుచేశారు.

ఓయూ టెక్నాలజీ కాలేజీ సమస్యలను పరిష్కరించాలి

తార్నాక, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఓయూ టెక్నాలజీ కాలేజీలోని సమస్యలను పరిష్కరించాలని ఏబీవీపీ డిమాండ్ చేసింది. గురువారం ఓయూ పరిపాలన భవనం ఎదుట ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు సరిపడా తరగతి గదులు, టీచింగ్, నాన్ టీచింగ్‌స్టాఫ్, ల్యాబ్ సౌకర్యాలు లేకపోవడం వలన తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సెమిస్టర్ పరీక్షలు జరిగి ఐదు నెలలు గడుస్తున్నా ఇప్పటీవరకు ఫలితాలను విడుదల చేయలేదన్నారు. అదేవిధంగా విద్యార్థినులకు హాస్టల్ భవనం ఒకచోట, భోజనవసతి మరోచోట ఉండటం వల్ల కిలోమీటరు దూరం నడవాల్సి వస్తోందన్నారు.

కేవైసీ అప్‌డేట్ అంటూ రూ.30 లక్షలు లూటీ

తిరుమలగిరి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కేవైసీ అప్‌డేట్ పేరుతో సైబర్ నేరగాళ్లు కాజేసిన డబ్బును బ్యాంక్ అధికారులు, పోలీసులు కలిసి కాపాడారు. తిరుమలగిరికి చెందిన వైద్యుడికి గుర్తు తెలియని వ్యక్తులు ఎస్‌బీఐ బ్యాంకు అధికారులమంటూ ఫోన్ చేశారు. కేవైసీ అప్‌డేట్ చేయాలి. లేకపోతే ఖాతా బ్లాక్ అవుతుంది' అని బెదిరించారు. ఫోన్‌కు వచ్చిన ఓటీపీ చెప్పగానే వైద్యుడి ఖాతాలోని రూ.30 లక్షలు కాజేశారు. ఖాతా నుంచి డబ్బులు పోయిన సందేశం చూసిన వెంటనే బాధితుడు తిరుమలగిరి ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్‌ను సంప్రదించాడు. మేనేజర్ సూచనల మేరకు తిరుమలగిరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంటనే కేసు నమోదు చేసుకున్న తిరుమలగిరి పోలీసులు వేగంగా స్పందించి సైబర్ క్రైం అధికారులకు సమాచారమిచ్చారు. కేసు వివరాలతో బ్యాంకు అధికారులను సంప్రదించి సైబర్ నేరగాళ్ల ఖాతాను ఫ్రీజ్ చేయించారు.

నిమ్స్‌ను సందర్శించిన ఆరోగ్య శ్రీ సీఈవో

హైదరాబాద్ సిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ సీఈవో శివశంకర్ గురువారం నిమ్స్‌ను సందర్శించారు. మెడికల్ ఆంకాలజీ, నెఫ్రాలజీ వార్డులో రాజీవ్ ఆరోగ్యశ్రీ లబ్ధిదారులతో ఆయన మాట్లాడారు. నిమ్స్ డయాలసిస్ వీడియో మానిటరింగ్ యూనిట్ ద్వారా జిల్లా యూనిట్లలోని డయాలసిస్ రోగులను కలిసి మాట్లాడారు. నిమ్స్ కోఆర్డినేటర్ మహేష్ బాబు చికిత్స ప్రోటోకాల్‌ల గురించి, రాజీవ్ ఆరోగ్యశ్రీ లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా అడ్మిషన్లు, సంరక్షణ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ లక్ష్మీభాస్కర్, జేఈవో ఎంపానెల్‌మెంట్ డాక్టర్ నరేష్, జీఎం ఫీల్డ్ ఆపరేషన్స్ డాక్టర్ రాంబాబు, జిల్లా మేనేజర్ పాల్గొన్నారు.

హనుమాన్ దేవాలయంలో హుండీ లెక్కింపు

తిరుమలగిరి, నవంబర్ 28 (ఆంధ్రజ్యోతి): బొల్లారం డౌటన్ బజార్‌లోని దేవాదాయ ధర్మాదాయ శాఖకు చెందిన హనుమాన్ దేవాలయ హుండీని ఈఓ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం లెక్కించారు. రూ.48,836 ఆదాయం వచ్చింది. దేవాలయ అభివృద్ధి కోసం మరింత కృషి చేస్తామని ఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ అండాలు, దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు సత్యనారాయణ, రాములు, విష్ణువర్ధన్, భక్తులు పాల్గొన్నారు.